క్లుప్తంగా

ఆదిత్యాలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



విరాళ చెక్కును అందజేస్తున్న సత్యనారాయణరాజు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి విశాఖపట్నానికి చెందిన కె.వి.సత్యనారాయణరాజు గురువారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ మేరకు చెక్కును ఆలయ జూనియర్ అసిస్టెంట్ చక్రవర్తికి అందించారు. కార్యక్రమంలో అర్చకులు రాజాబాబు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు రాయితీపై వరి విత్తనాలను సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేష్ గురువారం పంపిణీ చేశారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ అలుగోలు లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ చందనాల గణపతి, మాజీ సర్పంచ్ కంచరాన సూరన్నాయుడు, బాలబొమ్మ వెంకటేశ్వరరావు, నర్సింగ యాదవ్, మచ్చ శ్యామ్, డి.రమణ, రైతులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్‌ల శుభ్రత



వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుద్ధ్య సిబ్బంది

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మురపాక పంచాయతీ పరిధిలో గల వాటర్ ట్యాంక్‌లను సర్పంచ్ పెయ్యిల నాగమణి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి కె.వి.ప్రసాద్ పారిశుద్ధ్య సిబ్బందితో గురువారం శుభ్రం చేయించారు. ట్యాంకుల్లో బ్లీచింగ్ చల్లి శుభ్రం చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కలుషిత నీరు సరఫరా కాకుండా ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు ట్యాంక్‌లను శుభ్రం చేసి నీటిని విడుదల చేయిస్తున్నామని సర్పంచ్ తెలిపారు. నీటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ట్యాంక్‌ల్లో ఎక్కువ రోజులు నీటి నిల్వలు ఉండకుండా, విషజ్వరాల బారిన ప్రజలకు పడకుండా, సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. మురపాక, పీబీనగర్ కాలనీ, కొత్తపేట తదితర గ్రామాల్లోని ట్యాంక్‌లను శుభ్రం చేశారు.

ప్రయాణికుడికి సెల్‌ఫోన్ అందజేత



సెల్‌ఫోన్ అందుకుంటున్న రాంబాబు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నుంచి పాతపట్నం వెళ్లే ఆర్టీసీ బస్సులో రాంబాబు అనే ప్రయాణికుడు గురువారం రూ.12వేలు విలువైన సెల్‌ఫోన్ జారవిడుచుకున్నాడు. విషయాన్ని గ్రహించిన రాంబాబు తన ఫోన్‌కు డయల్ చేయగా పాతపట్నం బస్ కండక్టర్ శ్రీనివాసరావు తన వద్దే ఫోన్ ఉందని చెప్పడంతో కాంప్లెక్స్ వద్ద తిరిగి అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ సెక్యూరిటీగార్డు, సిబ్బంది పాల్గొన్నారు.

షిర్డీసాయినాథునికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: బొందిలిపురంలోని సాయి దర్బార్‌లో షిర్డీసాయినాథునికి గురువారం సందర్భంగా ప్రత్యేక పుజలు జరిగాయి. అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మ ఆధ్వర్యంలో స్వామికి ఉదయం హారతి, వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ సేవ జరిగింది. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.

నేటి నుంచి కనకదుర్గాదేవి మహోత్సవాలు



దుర్గాదేవి అమ్మవారి నిజస్వరూపం

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామంలో గల కనక దుర్గాదేవి అమ్మవారి ప్రథమ వార్షికోత్సవ మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఈ యాత్రా మహోత్సవాలు 23వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. 21న అమ్మవారికి ముర్రాటలు, కుంకుమ పూజలు, 22న హోమం, 23న మొక్కులు, సాయంత్రం అమ్మవారి ఊరేగింపు చేస్తామన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి



శ్రీకాకుళం రూరల్:ఎమ్మెల్యే శంకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు



జి.సిగడాం: రెవెన్యూ సిబ్బందిని సత్కరిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ నిర్మల

శ్రీకాకుళం రూరల్: రెవెన్యూ పరమైన సమస్యలపై కార్యాలయాలకు వచ్చేవారిపై సంబంధిత సిబ్బంది సానుకూలంగా వ్యవహరిస్తూ సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ డేను నిర్వహించారు. తొలుత ఆర్డీవో సీహెచ్ రంగయ్య, తహసీల్దార్ బి.వి.రాణి తదితరులు ఎమ్మెల్యే శంకర్‌ను సత్కరించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించడంలో రెవెన్యూ ఉద్యోగులు ముందంజలో ఉండాలన్నారు. ఈసందర్భంగా రెవెన్యూ ఉద్యోగులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత రెవెన్యూ డివిజినల్ అధికారి పి.ఎం.జె.బాబు, విశ్రాంత తహసీల్దార్లు ఎస్ఆర్ రవీంద్రనాథ్, ఎస్.మెహన్‌రావు, డి.చంద్రశేఖర్, జి.సురేష్ ఉన్నారు.

జి.సిగడాంలో..

జి.సిగడాం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ శాఖలో పని చేసి ప్రజలకు ఉత్తమ సేవలను అందించిన జి.సిగడాం వీఆర్‌ఓ భూపతి నర్సింగరావు, ఐకేపీ సర్వేయర్ మొయ్యి ఈశ్వరరావు, మధుపాం వీఆర్‌ఏ పోతయ్యను ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.నిర్మల, సిబ్బంది సన్మానించారు. రీ సర్వే డీటీ గాయత్రి, ఆర్‌ఐ రామచంద్రరావు, వీఆర్‌ఓలు పొట్నూరు జగన్నాథం, ముద్దాడ నీలకంఠం, సీతయ్య, ఎరకయ్య, మహాలక్ష్మి, శ్రీనివాసరావు, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ డే

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ డేని ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళం నగరంలో రెవెన్యూ అతిథి భవనంలో జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ జెండాను శ్రీకాకుళం జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం అధ్యక్షులు కె.శ్రీరాములు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవిన్యూ శాఖ ఔన్నత్యాన్ని కొనియాడుతూ ప్రజలతో రెవెన్యూ ఉద్యోగులు సేవా దృక్పథంతో పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా మాజీ అధ్యక్షులు, విశ్రాంత తహసీల్దార్లు ఎం.వి.సూర్యనారాయణ, జల్లెపల్లి రామారావు, ఎం.కాళిప్రసాద్‌లను దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వేణుగోపాలరావు, జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎస్.రాజు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.దిలీప్ చక్రవర్తి, మురళీధర్ నాయక్, డి.పద్మావతి, శ్రీకాకుళం డివిజన్ అధ్యక్షులు ఎస్.కిరణ్‌కుమార్, కార్యదర్శి డి.ప్రకాశరావు, పలాస డివిజన్ అధ్యక్షులు ఆర్.రామారావు, టెక్కలి డివిజన్ కార్యదర్శి ఆర్.రవికుమార్ పాల్గొన్నారు.



శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్యోగులను సత్కరిస్తున్న సంఘ నాయకులు

ఘనంగా పండిత సత్కారాలు



వేదపఠనం చేస్తున్న పండితులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం గుడివీధిలోని ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా గురువారం పండిత సత్కారాలు జరిగాయి. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో స్వామికి మంగళశాసనములు, వేద విధులైన పండితులచే వేద పఠనం, చతుర్వేద పారాయణ జరిగింది. అనంతరం ప్రముఖ వేద పండితులు ఆరవెల్లి హరగోపాల శర్మ పర్యవేక్షణలో పండితులకు సత్కారం, మహదాశీర్వచనం నిర్వహించారు. కాగా శుక్రవారం నాగావళి నదిలో స్వామివారికి త్రిశూల స్నాన మహోత్సవం జరుగుతుందని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో వేదపండితులు వేమూరి ప్రభాకరశర్మ, తెన్నేటి వెంకన్నశర్మ, ధర్భముళ్ల ఆదిత్య శర్మ, పెంటా శ్రీనివాసశర్మ, తుమరాడ సాయి సందీప్ శర్మ, ధర్మపురి కృష్ణమూర్తి శర్మ, పెంట రాంగోపాల శర్మ, గన్నవరం కృష్ణారావు, రాజేశ్వరమ్మ దంపతులు, ఆలయ ఈవో సర్వేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యుడు నాగేశ్వరరావు, లలితా మండలి సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గౌరవ డాక్టరేట్ అందుకున్న సుసరాపు



డాక్టరేట్‌ను అందుకుంటున్న లక్ష్మీగణపతి శర్మ

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం పట్టణంలోని కత్తెర వీధికి చెందిన రాజరాజేశ్వరీ సంగీత విద్యాపీఠం నిర్వాహకులు సుసరాపు లక్ష్మీగణపతి శర్మకు గౌరవ డాక్టరేట్ లభించింది. ఢిల్లీకి చెందిన ఎంబీఆర్ మేజిక్ అండ్ ఆర్ట్స్ యూనివర్సిటీ ప్రతినిధుల నుంచి డాక్టరేట్‌ను అందుకున్నట్టు లక్ష్మీగణపతి శర్మ గురువారం తెల్పారు. వయోలిన్, కర్నాటక శాస్త్రీయ సంగీతంలలో డిప్లమో కోర్సు పూర్తిచేసి ఎంతోమందికి సంగీతంలో శిక్షణ ఇస్తున్న సేవలను గుర్తించి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్టు పేర్కొన్నారు. పీఠంలో శ్రీవిద్యకు సంబంధించిన ఎన్నో గ్రంథాలను తెలుగులో అచ్చు వేయించి దీన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావాలనే కృషిని ఈయన చేస్తున్నారు. ఇప్పటికే పలు అవార్డులను అందుకున్న లక్ష్మీగణపతి శర్మకు తాజాగా డాక్టరేట్ రావడంపై అభిమానాలు ఆనందం వ్యక్తం చేశారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



ఎచ్చెర్ల: పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న దృశ్యం



జి.సిగడాం: పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు

ఎచ్చెర్ల: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని లావేరు మండలం పంచాయతీ విస్తరణ అధికారి వి.విశ్వేశ్వరరావు తెలిపారు. పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా గుంటుకుపేట పంచాయతీలో గురువారం చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వీధుల్లో చెత్తాచెదారాలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు.

జి.సిగడాం: మండలంలోని బాతువ, గెడ్డకంచరాం, ఎందువ, జి.సిగడాం గ్రామాల్లో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురుగు కాలువలను శుభ్రవం చేశారు. మండల పంచాయతీ అధికారి ఎస్.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: మండలంలోని ఎస్ఎస్ఆర్‌పురం గ్రామంలో గల సాయి ఆశ్రమంలో గురువారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

జి.సిగడాం: మండలంలోని ఆనందపురం గ్రామంలో 100 అడుగుల ఎత్తుగల వెంకటి సాయికోటి మహస్థూపం వద్ద గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ్యగురువుల అమ్ముల సాంబశివరావు ఆశీస్సులతో పూజా కార్యక్రమాలు చేపట్టారు. దేవరవలస, పెంట, జాడ, గెడ్డకంచరాం, జి.సిగడాం గ్రామాల్లో గల బాబా ఆలయాల్లో పూజులు చేశారు.

23న జిల్లా అండర్-19 చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి అండర్-19 బాలబాలికల చెస్ ఎంపిక పోటీలు ఈనెల 23వ తేదీన జరగనున్నాయని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బగాది కిషోర్, జామి రమేష్ గురువారం తెలిపారు. శ్రీకాకుళం నానుబాలవీధిలో ఉన్న చెస్ శిక్షణ కేంద్రంలో ఆ రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి ఎంపిక పోటీలు జరుగుతాయని చెప్పారు. పాల్గొనే బాలబాలికలు 2005 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించి ఉండాలని సూచించారు. ఇక్కడ ఎంపికై న బాలబాలికలను వచ్చేనెల (తేదీలు ఖారుకాలేదు)లో నంద్యాల వేదికగా జరగనున్న ఏపీరాష్ట్రస్థాయి అండర్-19 చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు ఎంట్రీఫీజుగా రూ.300 చెల్లించాల్సి ఉంటుందన్నారు. 22వ తేదీ సాయంత్రం ఆరు గంటల్లోగా తమ పేర్లను అభినవ్(సెల్:74168 64642)కు కాల్‌చేసి నమోదు చేసుకోవాలని సూచించారు.

ఐటీఐ కౌన్సెలింగ్‌లో 389 మందికి ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో కౌన్సెలింగ్ కొనసాగుతోంది. 878 నుంచి 1399 ర్యాంకు మధ్య విద్యార్థులకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించగా 232 మంది హాజరయ్యారు. 124 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. 1400 నుంచి 1642 మధ్య ర్యాంకు విద్యార్థులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమైన కౌన్సెలింగ్‌లో ఇప్పటి వరకు 389 మంది ప్రవేశాలు పొందారు. ఈ నెల 23 వరకు కౌన్సెలింగ్ కొనసాగనుంది. జిల్లా ఉద్యోగ, ఉపాధి కల్పన అధికారి సుధ, ప్రిన్సిపాల్, ప్రవేశాల కన్వీనర్ ఎల్.సుధాకర్‌రావు, అడ్మిషన్స్ కమిటీ సభ్యులు చిట్టి నాగభూషణం, ప్లేస్‌మెంట్ అధికారి కామేశ్వరావు పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థిని చదువుకు చేయూత



దివ్యశ్రీకి సాయాన్ని అందజేస్తున్న వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నగరంలోని వాంబే కాలనీకి చెందిన నిరుపేద విద్యార్థిని చింతగడ దివ్యశ్రీ ఇంటర్మీడియెట్ పరీక్షల్లో 979 మార్కులు తెచ్చుకుంది. అలాగే జేఈఈ మెయిన్స్‌లో 3,700 రాంక్ సంపాదించి త్వరలో ఐఐటీ లేదా ఎన్ఐటీలో ప్రవేశం పొందనుంది. దివ్యశ్రీ చదువుకు పేదరికం అడ్డు కాకూడదని తెలిసికున్న స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఆర్థికసాయం చేసేందుకు ముందుకువచ్చారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థినికి రూ.15 వేలు సాయం అందించారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బి.వి.రవిశంకర్, బి.డేవీ ప్రసాద్, వాకర్స్ సంఘాల కోఆర్డినేటర్ ఎస్.జోగినాయుడు మాట్లాడుతూ.. పేదరికం చదువుకు అడ్డు కాకూడదనే ఉద్దేశంతోనే నడక సంఘాల సభ్యులు అంతా ముందుకు వచ్చి దివ్యశ్రీకు ఆర్థిక సహాయాన్ని అందించామని అన్నారు. జేసీఐ మణిశర్మ, స్వచ్ఛంద సేవకులు సాయిబాబా అభ్యర్థన మేరకు ఈ ఆర్థిక సహాయాన్ని అందించామన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు జి.ఇందిరా ప్రసాద్, పీజీ గుప్తా, గేదెల లక్ష్మి, బరాటం శ్రీనివాస్, గుడ్ల జగ్గారావు, ఆర్.సి.పట్నాయక్ ఉన్నారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ



జి.సిగడాం: కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

జి.సిగడాం: వాండ్రంగి యూపీ పాఠశాలలో ప్రభుత్వం అందజేసిన స్టూడెంట్ కిట్లును స్థానిక నాయకులు గురువారం పంపిణీ చేశారు. సర్పంచ్ సాకేటి నాగరాజు మాజీ సర్పంచ్ సనపల త్రినాథరావు, బొట్ల భాస్కరరావు, హెచ్ఎం నీరజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రణస్థలం: ప్రభుత్వం ఉచితంగా అందించే స్టూడెంట్ కిట్లు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రణస్థలం సర్పంచ్ పిన్నింటి భానోజీనాయుడు అన్నారు. మండలంలోని రణస్థలంలో పంచాయతీలో గల చినలంకపేట పాఠశాలలో స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. నాయకులు లంక రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో వ్యవసాయాభివృద్ధిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయం, అనుబంధ శాఖలైన హార్టికల్చర్, సెరికల్చర్, పశుసంవర్ధక శాఖ, ఫిషరీస్, మార్కెటింగ్, కో–ఆపరేటివ్, ఏపీఎంఐపీ, వంశధార తదితర శాఖలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,82,325 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేసే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఇందులో వరి 1,61,500 హెక్టార్లు, మొక్క జొన్న 14000 హెక్టార్లు సాగవుతుందని తెలిపారు. 31699 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, అందులో 16,904 క్వింటాళ్ల పంపిణీ పూర్తయిందని చెప్పారు. 1,18,820 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు కేటాయించగా 33,000 మెట్రిక్ టన్నులు పంపిణీకి సిద్ధం చేశామన్నారు. గత ఏడాది జిల్లాలో రూ. 8029 కోట్ల పంట రుణాలు అందజేయగా ఈ ఏడాది కూడా అర్హులైన రైతులందరికీ పంట రుణాలు మంజూరు చేసి బ్యాంకర్లు సహకరించాలన్నారు. పి. ఎం. కిసాన్ కింద జిల్లాలో 2.29 లక్షల మంది రైతులకి రూ.45.8 కోట్లు ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. వంశధార ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుత పనుల వివరాలు, నీటి నిల్వ, ట్రిబ్యునల్ కేసుల ప్రస్తుత స్థితి గురించి సంబంధిత శాఖాధికారులు వివరించారు. మడ్డువలస, తోటపల్లి ప్రాజెక్టులలో ప్రస్తుత నీటిని నిలవ స్థితిని ఖరీఫ్ 2024–25 కార్యాచరణపై చర్చించారు. పశుసంవర్ధక శాఖపై సమీక్షలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో చాలావరకు పాడి రైతులు ఉన్నారని, పశుసంవర్ధక శాఖ ద్వారా అమలవుతున్న పథకాలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఉద్యానవన శాఖ లక్ష్యాలు, ప్రగతిపై నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, వ్యవసాయాధికారి కే.శ్రీధర్, పశుసంవర్ధక శాఖ జేడీ జయరాజు, వంశధార ఎస్ఈ రాంబాబు, నీటి పారుదల శాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకర్‌రావు, మత్స్య శాఖ డీడీ శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ డీఎం రమణి, సెరికల్చర్ ఆఫీసర్ రాజేంద్ర ప్రసాద్‌బాబు, ఉద్యానవన శాఖాధికారి ఆర్.వి.వి.ప్రసాద్, మార్కెటింగ్ ఏడీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తితో 'పానీ హటీ చీడాదహి' ఉత్సవం



గౌర, నితాయ్‌లకు మంచినీటి స్నానం చేయిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నాగావళి నది పొన్నాడ బ్రిడ్జి ఒడ్డున ఉన్న ఇస్కాన్ సుభద్ర, బలదేవ్, జగన్నాథ మందిరంలో 'పానీ హటీ చీడాదహి' ఉత్సవాన్ని గురువారం భక్తితో నిర్వహించారు. ఇస్కాన్ స్థాపకులైన శ్రీచైతన్య మహాప్రభు, భక్తుడైన నిత్యానంద ప్రభు (గౌర, నితాయ్)లకు మందిరం ఆవరణలో ఏర్పాటు చేసిన కొలనులో మంచినీటి స్నానం కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా భక్తులు తీసుకు వచ్చిన మామిడి పండ్లు, బెల్లం, పాలు, 108 మట్టి కుండలలో తీపి పదార్థాలను గౌర, నితాయ్‌లకు నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాద పంపిణీ జరిగింది. చైతన్యలీలా, కీర్తనల ఆలాపనలు జరిగాయి. భక్తులు అధికంగా పాల్గొన్నారు.

వంశధార కుడికాలువ పరిశీలన



చింతాడ చెరువు వద్ద పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్: చింతాడ వద్ద గల వంశధార కుడి కాలువ ఎత్తిపోతల పథకం ఆయకట్టును శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ రైతులతో కలిసి గురువారం పరిశీలించారు. రైతాంగంపై గడిచిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని అన్నారు. ప్రధాన కాలువను అనుసరించి అంపోలు వరకూ పర్యటించిన ఎమ్మెల్యే కాలువ పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమన్నారు. శివారు భూములకు సాగునీరందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాలువ పనుల పరిశీలనకు వస్తున్నట్టు ముందస్తుంగా సమాచారం ఇచ్చినప్పటికీ సంబంధిత అధికారులు రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

యోగా వేడుకల్లో పాల్గొనాలి

- జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్



యోగాడే పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసి, అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా దినోత్సవ కార్యక్రమం ఏర్పాట్లపై జేసీ అధ్యక్షత గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగా వల్ల మానసిక ఒత్తిడి తగ్గి, శారీరక ఆరోగ్యం, జ్ఞాపకశక్తి, మానసిక ప్రశాంతత యోగా ద్వారా లభిస్తుందన్నారు. శుక్రవారం ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకూ ఆయుష్ శాఖ, ఎన్‌వైకే ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వాకర్స్ క్లబ్ సభ్యులు, యోగా శిక్షణ కేంద్రాల ప్రతినిధులు పాల్గొనేలా చూడాలన్నార. ఆయుష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ పి.జగదీష్ కార్యక్రమ ఏర్పాట్లు వివరించారు. యోగాడే పోస్టర్లను అధికారులు ఆవిష్కరించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఏపీసీ సర్వశిక్షాభియాన్, జిల్లా విద్యాశాఖధికారి వెంకటేశ్వరరావు, యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.వి.ప్రసాదరావు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ శ్రీధర్, జిల్లా పర్యాటక అధికారి ఎస్.నారాయణరావు, నెహ్రూ యువ కేంద్రం జిల్లా సమన్వయకర్త ఉజ్వల్, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్‌సింగ్ పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదానం చేస్తున్న యువకులు

శ్రీకాకుళం అర్బన్: రక్తదానానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ అన్నారు. రక్తం కొరతలేని శ్రీకాకుళంగా నిలవాలంటే మనమంతా రక్తదాతలుగా మారాలన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని హోటల్ నాగావళిలో మెగా రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. క్లబ్ జోన్ చైర్మన్ డాక్టర్ బాడాన దేవభూషణంతో పాటు పలువురు రక్తదాతలు పాల్గొని తమవంతు పాత్ర పోషించారన్నారు. పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఈనాడు పత్రిక అధినేత రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. మెంటార్ నటుకుల మోహన్, సురంగి మోహన్‌రావు, బరాటం సంతోష్, కోరాడ హరిగోపాల్, క్లబ్‌సెక్రటరీ టి.రాంగోపాల్, ట్రెజరర్ శిల్లా మణికంఠ, సభ్యులు చరణ్, భారతి, రామ్మోహన్, సునీల్, వేణు పాల్గొన్నారు. రక్తదాతలకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, డాక్టర్ దానేటి శ్రీధర్ మెడల్స్, ప్రశంసా పత్రాలను అందించారు.